క్లుప్తంగా

28న భూముల కౌలువేలం

భీమవరం(వత్సవాయి): జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామంలో వేంచేసియున్న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానానికి భీమవరం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న 19.32 ఎకరాల వ్యవసాయ భూములకు సోమవారం కౌలువేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ కానూరి సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరంలోని శ్రీరాజగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించే కౌలువేలంలో ఆసక్తిగలవారు పాల్గొనాలని ఈఓ కోరారు. ఏడాది కాలానికి కౌలువేలం నిర్వహిస్తున్నామని, దేవాదాయశాఖకు బకాయిలు ఉన్నవారు ఈ వేలంలో పాల్గొనేందుకు అనర్హులని ఈఓ స్పష్టం చేశారు.

అమ్మవారి చీరలకు వేలం నిర్వహణ



నందిగామరూరల్: మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారికి చీరల వేలం పాటల ద్వారా రూ.9,900 ఆదాయం వచ్చిందని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శనివారం చీరల వేలం పాటలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలకు వేలం నిర్వహించగా పైఆదాయం వచ్చినట్లు వివరించారు. ఆలయ ధర్మకర్త చిరుమామిళ్ల సాయి, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

శనీశ్వరునికి తైలాభిషేకాలు

నందిగామరూరల్: మండలంలోని శైవక్షేత్రాలలో శనిత్రయోదశి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని నవగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గోళ్లమూడి గ్రామంలోని శంభులింగేశ్వర స్వామి, కూడలి సంగమేశ్వరస్వామి, రామలింగేశ్వర స్వామి వారి ఆలయాల్లోని నవగ్రహాలు, శనీశ్వరునికి తైలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నందిగామటౌన్: పట్టణంలోని నెహ్రూనగర్‌లో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. కార్యక్రమంలో కొమరగిరి వాచస్పతి, కొల్లూరు వెంకటేశ్వరరావు, అర్చకులు యోగానందాచార్యులు, శ్రీనివాస అనంతాచార్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

236 మందికి కంటి పరీక్షలు



బండిపాలెం(జగ్గయ్యపేట): మండలంలోని బండిపాలెం గ్రామసచివాలయంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సచివాలయంలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర నేత్రాలయ వైద్యులు శ్రీకాంత్, కృష్ణచైతన్య పాల్గొని 236 మందికి వైద్య పరీక్షలు చేశారు. సర్పంచి ఎలిశమ్మ, ఫౌండేషన్ సభ్యులు కట్టా నరసింహారావు, రఘురాం, నాయకులు పెంట్యాల పూర్ణచంద్రరావు, అడుసుమల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

నిందితుడు సూర్యప్రకాష్‌కు రిమాండ్

నందిగామటౌన్: ఓ వ్యక్తి తనను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడినట్లు ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగామ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..మండలంలోని లింగాలపాడు గ్రామానికి చెందిన పసుపులేటి సూర్యప్రకాష్ తనపై అత్యాచారం చేసినట్లు అదే గ్రామానికి చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ వైవిఎల్ నాయుడు శనివారం అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడు సూర్యప్రకాష్‌ను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ముక్త్యాల(జగ్గయ్యపేట): మండలంలోని ముక్త్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోహెన్స్ లైఫ్ సైన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసంస్థ వైస్ ప్రెసిడెంట్ మురళీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వైద్యశిబిరాన్ని నిర్వహించి, ప్రజలకు అన్నిరకాల వైద్య పరీక్షలు చేస్తామని వివరించారు. ఈశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పసుపు రైతుకు పుట్టెడు కష్టాలు

- ఈ ఏడాది పసుపు పంటకు లభించని మద్దతు ధర..
- కొనేనాథుడు లేక రైతులు విలవిల
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- హడలెత్తిస్తున్న అకాల వర్షాలు



చెరువుకొమ్ముపాలెం వద్ద కళ్లంలో ఆరబెట్టిన పసుపు

నందిగామరూరల్: ప్రకృతి విపత్తులు...తెగుళ్లు...చీడపీడలు...అకాల వర్షాలు..అదనులో అందని సాగునీరు..ఇలా పసుపుసాగు రైతులను పంట కాలమంతా అనేక సమస్యలు వెంటాడాయి. గంపెడాశతో..ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని తొమ్మిదినెలలపాటు పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నప్పటికీ...మద్దతు ధర మాత్రం లభించలేదు. దీంతో పసుపు రైతులకు చివరికి తీవ్ర కష్టాలు..నష్టాలే మిగిలాయి.

అడియాసగానే మద్దతు ధర..

నందిగామ నియోజకవర్గంలో రైతులు 162 ఎకరాల్లో పసుపు సాగు చేపట్టారు. ఈ పంట ఎనిమిది నుంచి తొమ్మిది నెలల కాల వ్యవధిలో చేతికొస్తుంది. ఈ ఏడాది అదునులో పసుపు పంటకు సాగునీరు అందకపోవటంతోపాటు దుంప కుళ్లు, వేరు కుళ్లు వంటి చీడపీడల ఉధృతి తప్పలేదు. ఇక అకాల వర్షాలు పంట దిగుబడులపై తీవ్రప్రభావం చూపడంతో ఈ ఏడాది పంట దిగుబడులు సగానికి సగం పడిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పసుపు తడిచిపోవడంతో మరింత నష్టం వాటిల్లేలా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఖర్చులు తడిసి మోపెడు..

పసుపు పంట సాగుచేసిన రైతులకు ఈ ఏడాది పెట్టుబడులు సంగతెలా ఉన్నా నీటి తడులకు ఏర్పాటు చేసిన గొట్టాల ఖర్చు కూడా వచ్చేలా కనిపించడం లేదు.

ఎకరా రూ.లక్ష నుంచి 1.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టి పంట సాగు చేసినా దిగుబడి మాత్రం అంతంతమాత్రమే. గతేడాది ఎకరాకి 35 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల దిగుబడులురాగా, ఈ ఏడాది ఎకరాకు 20 క్వింటాళ్లకు మించకపోవడం గమనార్హం.

అదనులో సాగునీరు అందకపోవటంతో మరో రూ.80వేలు అదనంగా వెచ్చించి ప్లాస్టిక్ గొట్టాలను ఏర్పాటు చేసి పంటకు నీటిని అందించామని రైతులు చెబుతున్నారు.

క్వింటా ధర రూ.8వేలే..

దీనికి తోడు పసుపు ధరలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. గతేడాది క్వింటాకు 13 వేల వరకు ధర పలుకగా ఈ ఏడాది రూ.8వేలకే పరిమితమైంది. ఈ ధరకు కూడా కొనుగోలుదారులు ముందుకురాకపోతుండటంతో రైతులు రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

మద్దతు ధర మూడోవంతు తగ్గుదల..

చీడపీడలు, తెగుళ్లు, ప్రకృతి ఆటుపోట్లను ఎదుర్కొని పంట సాగు చేసినా తీరా పంట చేతికొచ్చే సమయానికి మద్దతు ధర ఉండకపోవడంతో ఈ ఏడాది పసుపు రైతుకు నష్టాలు తప్పడం లేదు. మద్దతు ధర ప్రకటించి అండగా నిలవాల్సిన ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. గతేడాది క్వింటా పసుపు రూ.13వేలు పలుకగా, ఈసారి కేవలం రూ.8వేలకే పరిమితమైతే తామెలా వ్యవసాయం కొనసాగించగలమని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతేడాదితో పోల్చితే మద్దతు ధర ఈసారి మూడోవంతు తగ్గడం గమనార్హం. ప్రభుత్వం నుంచి రైతులకు సరైన మద్దతు లభించకపోగా, దళారీలు మరింత నష్టం చేకూర్చుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి మద్దతు ధర ప్రకటించడమే కాకుండా పసుపు పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగు ఖర్చులు కూడా వచ్చేలా లేవు



నేను 1.50ఎకరాల్లో పసుపు పంట సాగు చేశాను. అదునుకు సాగునీరు అందక దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 20 క్వింటాళ్ల మేర కూడా దిగుబడులు రాలేదు. రూ. లక్ష పెట్టుబడి ఖర్చులయ్యాయి. నీటి తడులు వేసేందుకు గొట్టాల ఏర్పాటుకే అదనంగా మరో రూ.80 వేలు ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఈ ఏడాది పెట్టిన పెట్టుబడులు సంగతెలా ఉన్నా గొట్టాల ఖర్చులు కూడా వచ్చేలా లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

కానాల పెద్దవెంకటరెడ్డి, రైతు, చెరువుకొమ్ముపాలెం

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



తొమ్మిది నెలలపాటు అనేక వ్యయప్రయాసల కోర్చి పసుపు పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. తీరా పంట చేతికొచ్చే సమయంలో అకాలవర్షాలకు నష్టపోవాల్సి వచ్చింది. మద్దతు ధర క్వింటా రూ.8వేలకు మించి లేదు. సాగుఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు మాత్రం ఉండటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్దతు ధర ప్రకటించడంతోపాటు పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

దిలీప్‌రెడ్డి, రైతు, చెరువుకొమ్ముపాలెం

అతివేగం ప్రమాదకరం



కంచికచర్లలో వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ రాజు



పేటలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కంచికచర్ల: అతివేగంగా వాహనాలు నడపడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని ఎస్‌ఐ బి.రాజు పేర్కొన్నారు. కంచికచర్లలోని పెట్రోల్‌బంక్ సెంటర్, జుజ్జూరు రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్లలో శనివారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. నిర్ణీత వేగంతో ప్రయాణించాలని, ప్రయాణసమయంలో అన్నిరకాల ధ్రువీకరణపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద ..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని చిల్లకల్లు టోల్‌ప్లాజా సమీపంలో పోలీసులు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ సిబ్బందితో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా నియంత్రణలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని పోలీసులు శనివారం క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా శనివారం ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది జాతీయ రహదారి నుంచి జగ్గయ్యపేట పట్టణంలోని వచ్చే అండర్‌పాస్ వద్ద ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులు, ఇతర వాహనాలను తనిఖీ చేశారు.

కంపచెట్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో పొలాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా దట్టంగా కంపచెట్లు పెరిగి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న వైనంపై ఈనెల 25న 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి పంచాయతీ పాలకులు స్పందించారు. గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్, కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ శనివారం ఉపాధి హామీ పథకం కింద ఈ కంపచెట్ల తొలగింపు పనులు చేపట్టారు. ఆయా పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.ఎన్‌ఆర్‌జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ బొక్కా మోహన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి' దినపత్రికకు గండేపల్లివాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.



గండేపల్లిలో కంపచెట్లు తొలగిస్తున్న సర్పంచి రవికుమార్, కార్యదర్శి రత్నాకర్

వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ ముస్లింల ర్యాలీ



నందిగామలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు



ఆర్డీఓ బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

నందిగామటౌన్: ముస్లింల మత స్వేచ్ఛను కాలరాసేలా కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తోందని నియోజకవర్గ ముస్లిం జేఏసీ, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా చేపట్టిన వక్ఫ్ ఆస్తుల సవరణ నల్లచట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, పహల్గాంలో ఉగ్రవాదుల పాశవిక కాల్పులను నిరసిస్తూ శనివారం నందిగామ పట్టణంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా నడుచుకుంటూ ముస్లింల మత స్వేచ్ఛకు తూట్లు పొడుస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ ఆస్తుల సవరణ నల్లచట్టాన్ని రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ బాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు.

ర్యాలీని అడ్డుకున్న పోలీసులు..

ఉగ్రవాదుల నుంచి ప్రమాదం పొంచి ఉందనే సమాచారంతో ముస్లింలు తలపెట్టిన శాంతియుత నిరసన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీఐ వైవిఎల్ నాయుడు మాట్లాడుతూ ఉగ్రవాదుల అలజడులు ఉన్నాయనే అనుమానంతో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలకు ప్రభుత్వ అనుమతులు లేవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్దమసీదు ముతావలి మహ్మద్‌ఖాజా, ముస్లిం నాయకులు మహ్మద్‌మస్తాన్, సయ్యద్ ఖాశీం, కమాలుద్దిన్, షేక్ జాఫర్, షేక్ మలక్‌బషీర్, షేక్ సుభాని, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

బాబు పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు



గోరంట్ల శ్రీనివాసరావు, వేముల బేబీరాణిలను సత్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ నిర్వీర్యమైపోతున్నాయని, అంతా రెడ్‌బుక్ రాజ్యాంగమే నడుస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఓరోజు తిరుపతి లడ్డూ..మరోరోజు బోటు.. ఇంకోరోజు ఐపీఎస్‌ల అక్రమ అరెస్టుల పేరుతో సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. విద్యుత్ బిల్లులు షాక్ కొట్టేలా పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ విషయంపై తమపార్టీ ప్రశ్నిస్తే లిక్కర్ స్కాం చోటుచేసుకుందంటూ డైవర్షన్ పాలిటిక్స్ నడిపిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలు ఇవ్వాలని అడిగేవారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఊరూ పేరులేని ఊర్సా కంపెనీకి ఎకరం 99 పైసలకే కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్రంలోని 66.60 లక్షల పింఛన్లలో 4లక్షల పింఛన్లు తొలగించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం ఏరులైపారుతోందన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయకుండా సీఎం చంద్రబాబును మోసం చేస్తున్నప్పటికీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ఇకనైనా మీ డైవర్షన్ పాలిటిక్స్ మానుకొని ప్రజలకు మీరిచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆపార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేతలకు ఘనసత్కారం...

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆపార్టీ మహిళావిభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన వేముల బేబీరాణి, సంచార జాతుల నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ గోరంట్ల శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ బీబీరాణి సేవలను కొనియాడారు. పార్టీ అభివృద్ధికి మరింత కృషిచేయాలని వారికి సూచించారు. బేబిరాణి మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉగ్రవాదం నిర్మూలనలో కేంద్రం విఫలం : సీఐటీయూ



కంచికచర్లలో ర్యాలీ చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు



జుజ్జూరులో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు



పేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, జరసం సభ్యులు

కంచికచర్ల : ఉగ్రవాదాన్ని అంతమొందించే విషయంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అందుకే కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, సీఐటీయూ నాయకులు మున్నంగి సోమేశ్వరరావు విమర్శించారు. పహెల్గాంలో జరిగిన ఉగ్రవాదుల మారణహోమాన్ని ఖండిస్తూ శనివారం కంచికచర్లలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగ వారు మాట్లాడుతూ దేశ భద్రతకు అత్యంత ముఖ్యమైన సైనిక నియామకాల్లో చిత్తశుద్ధి లోపించిందన్నారు. శాశ్వత ఉద్యోగాలను కాకుండా అగ్నిపథ్ పద్ధతిని సైన్యంలో ఖాళీలను భర్తీచేయడం తగదన్నారు.

సైన్యంలో ఖాళీగా ఉన్న 1,80లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం ఉగ్రవాదం పెరిగిపోవడానికి ఓ కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశీ విధానం కూడా దేశ భద్రతకు పెనుముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు జహీదా, సీఐటీయూ మండల కార్యదర్శి బెజ్జం భూషణం, సీఐటీయూ నాయకులు పుల్లమ్మ, వెంకటేశ్వరరావు, అంగనవాడి వర్కర్ల సంఘం నాయకులు మహాలక్ష్మి, మార్తమ్మ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: పెహల్గాంలో ఉగ్రవాదుల పాశవిక దాడులు బాధాకరమని సర్పంచ్ రమావత్ కోటి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో ఉగ్రదాడిని నిరసిస్తూ శనివారం రాత్రి గ్రామస్తులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. సర్పంచి మాట్లాడుతూ ఉగ్రదాడులను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షిస్తూ మౌనం పాటించారు. ర్యాలీలో నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

జగ్గయ్యపేట అర్బన్: జమ్మూ కాశ్మీర్‌లోని పహాల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి శివాజీ మాట్లాడుతూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు పర్యాటకులను కాల్చి చంపడాన్ని పిరికిపందల చర్యగా అభివర్ణించారు. పర్యాటకులే లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు దాడి చేయడం దేశంలో మతోన్మాదాన్ని ప్రేరేపించేందుకు చేసిన కుట్ర అని పేర్కొన్నారు. ర్యాలీలో కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పోతిపాక వెంకటేశ్వర్లు, భోగ్యం నాగులు, మాశెట్టి రమేష్, మెటికల శ్రీనివాసరావు, షేక్ కరీం పాల్గొన్నారు. అలాగే జగ్గయ్యపేట రచయితల సంఘం(జరసం) సభ్యులు అబ్బాస్ ఆలీ, సరికొండ రాజు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో ఒత్తిళ్లను జయించవచ్చు

లబ్బీపేట(విజయవాడతూర్పు): యోగా, ధ్యానంతో ఒత్తిళ్లను జయించవచ్చని ఎంజీఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడిసిన్ హెడ్ నవీ ముంబయిలోని అపోలో ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ సందీప్‌రాయ్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో శనివారం ప్రస్తుత సమాజంలో ఒత్తిళ్లు.. సహజ యోగ ప్రక్రియతో ఎదుర్కొనే పద్ధతులపై కళాశాలలో అకడమిక్ బ్లాక్‌లో సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ సందీప్‌రామ్ మాట్లాడుతూ ఎంత బిజీగా జీవితాన్ని గడుపుతున్నా, సమాజంలో ఎదురయ్యే ఒత్తిళ్లను తగ్గించుకోవాలన్నారు. ఒత్తిడి ఉంటే దీర్ఘకాలిక మానసిక, ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. సహజయోగ ధ్యాన ప్రక్రియలు, వైద్య విధానంతో ఒత్తిళ్లను జయించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముంబయికి చెందిన డాక్టర్ మాధురీరాయ్, ఎస్పీఎం అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.ప్రభాకర్, విజయశ్రీ, యోగా ట్రస్టు ప్రతినిధులు అడపా రామ్మోహనరావు, ఎస్ శంకర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు టి.క్రాంతికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి మే 28వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత ఎం.రత్నకమల్‌బాబు క్లాసులు బోధిస్తారని పేర్కొన్నారు. ప్రొజెక్టర్, స్క్రీన్ ద్వారా అధునాతన పద్ధతుల్లో ఇంగ్లిష్‌ను నేర్పడం, మాట్లాడిస్తారని వివరించారు. ఆసక్తి కలవారు 93985 26793, 94900 98408 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

వేదాద్రి(జగ్గయ్యపేట): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేదాద్రి గ్రామానికి చెందిన రుద్రపోగు వెంకటేశ్వర్లు, పసుమర్తి భాస్కరరావు కుటుంబాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంతరావు శనివారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో జవ్వాజి నాగరాజు, మాడు సేవ, గురవయ్య, శివకృష్ణ, కృపానందం తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామ రూరల్: మండలంలోని పెద్దవరం గ్రామానికి చెందిన పారి హేమలత (50) అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందగా, ఆమె కుటుంబానికి కంపాషన్ కమ్యూనిటీ ఆఫ్ సర్వీసెస్ అధ్యక్షుడు ఉలవలపూడి నరేంద్ర శనివారం రూ.4వేలను ఆర్థికసాయంగా అందజేశారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా ఉలవలపూడి నరేంద్ర మాట్లాడుతూ తమసంస్థను ఏర్పాటు చేసినప్పటి నుంచి అనేక సేవాకార్యక్రమాలను నిర్వహించి పేదలకు అండగా నిలుస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు మార్కపూడి ప్రవీణ్, పారి మైసయ్య, మార్కపూడి జేమ్స్, వినోద్, రమేష్, పిచ్చయ్య, పెద్దిరాజు, గ్రామస్తులు పేర్కొన్నారు.

పొక్లెయిన్, రెండు ట్రాక్టర్లు స్వాధీనం



చందర్లపాడు(నందిగామ రూరల్): ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే సహించేది లేదని చందర్లపాడు ఎస్‌ఐ దుర్గామహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని కొడవటికల్లు గ్రామ సమీపంలో కృష్ణానది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఓ ప్రొక్లెయిన్, రెండు ట్రాక్టర్‌లను శనివారం ఆయన స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ముప్పాళ్ల గ్రామానికి చెందిన కొణకంచి వెంకట్రావ్ అనేవ్యక్తి కొద్దిరోజులుగా ఇసుక అక్రమరవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడిచేసి పొక్లెయిన్, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.